# వీధి దీపం

అరుణ స్వెటర్ అల్లుతోంది. అప్పటికి అది ఆరోది. రంగురంగుల ఊలుతో రకరకాల డిజైన్లతో స్వెటర్‌లు. అల్లి అవి చిన్నబాబు కిరణ్‌కి రోజూ ఒకటి వేయాలని ఆవిడ కోరిక. నడుం నొప్పి పుడుతోంది. పసుపు, ఎరుపు దారాల కండెలు పక్కకి పెట్టి లేచింది అరుణ వంటింట్లోకి నడిచింది.

"తెస్తున్నా నమ్మగారూ" - రాములు టీ కప్పు అమ్మగారి చేతి కందించాడు కుంటుతూనే.

"నేను వచ్చి తెచ్చుకోవాలి - అంతేనా – నిద్ర మొఖం – ఛీ"– విసుక్కుంటూ బయటకి నడిచింది అరుణ.

అయ్యగారి బూట్లు పాలిష్ చేయటం అయింది. యాష్‌ట్రే కడిగి పెట్టడమయింది. ఆ తర్వాత అమ్మగారికి మూడోసారి టీ పెట్టడానికి వస్తుంటే వేలికి తక్కున గుచ్చుకుంది బొంగరానికుండే ఇనుప ముల్లు.... రక్తం వేలి నుండి బొట బొట కారింది. అంతకు ముందే చినబాబు బొంగరంతో ఆడుకొని ఇటు పడేసి వెళ్ళాడు. రాములు వేలి నొప్పి ఎక్కువైంది. గూట్లో డబ్బాలో వున్న పసుపు తీసి గట్టిగా అద్దాడు. రక్తం గడ్డ కట్టింది కాని నొప్పి?! ఆరోజు అన్నకి బ్లేడు కోసుకుపోయింది,

వెంటనే రక్తం కట్టడానికి పసుపు అద్దాడు. అదే గుర్తొచ్చింది రాములుకి. అన్న, తన అన్న ఎక్కడున్నాడో, ఎలా వున్నాడో, తింటున్నాడో, దెబ్బలే తింటున్నాడో – రాములుకన్నా రెండేళ్ళ పెద్దవాడు. రాములుకి అన్న గుర్తు రాగానే కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. కళ్ళు తుడుచుకుని వంటింటి గుమ్మంలో కూచున్నాడు రాములు.

నిద్ర లేచి వచ్చిన కిరణ్ బొంగరం ఎక్కడుందో అని వెతుకుతున్నాడు.

"ఇదిగో" చేతి కందించాడు రాములు.

"ఏడుస్తున్నావా రాములు" ప్రక్కన కూచున్నాడు కిరణ్.

"లేదు బాబు."

"ఆ అబద్ధం చెప్తున్నావు, నేను చూసాగా కళ్ళు తుడుచుకోవటం." అలా అంటూనే "అయ్యో! ఇదేంటి? ఉండు నేను కట్టు కడతా" కిరణ్ లోపలికి పరిగెత్తాడు.

వేలికున్న పసుపు ముద్ద నీళ్ళతో కడిగాడు శుభ్రంగా. పౌడరు బాగా చల్లాడు. దూది కప్పాడు, మళ్ళా పౌడరు, మళ్ళా దూది, తడిగుడ్డ తెచ్చి గట్టిగా వేలికి చుట్టాడు. "మళ్ళా రాత్రికి కట్టు గట్టిగా కడతాను, టించరు అమ్మ దాచింది ఎక్కడో" కిరణ్ అలా అంటూ తల ఎత్తాడు.

"చూస్తున్నాను వాడి వేలికి చిన్న దెబ్బ తగిలితే అంత గొడవా! కాసేపుంటే నొప్పి అదే తగ్గుతుంది. వాడి కాలి వేలు పట్టుకుని నువ్వు కడగటమా? వాడు దొరలాగా కూచుని నీచేత కడిగించటమా! అసలు నిన్ను" అరుణ గొంతు తగ్గించింది. ఒక్కసారిగా ఎదురుగా రాములు తండ్రి వచ్చి నిల్చున్నాడు.

వారం రోజులనాడు వచ్చాడు పాలరంగయ్య కొడుకుని తీసికెళ్ళిపోతానని, అరుణకి రాములు ఇంట్లో లేకపోతే జరగదు. చిన్న పని, పెద్ద పని తీరికగా లేకుండా వాడు చేయాల్సిన పనులు చాలా వున్నాయి

ఇంట్లో. పాలరంగయ్య వాణ్ణి ఈ ఇంట్లోంచి మాన్పించి, తనకి తోడుగా పనిలో వుంచుకోవాలని ఆలోచిస్తున్నాడు. ఇప్పుడు తను పిల్లవాడి మీద అరవడం వింటే, ఇప్పుడే రాములుని తీసికెళ్ళి పోతానంటే! అసలే తనకి చాలా ఇబ్బంది, మరో పని కుర్రాడు దొరకద్దూ వెంటనే.

"ఆ! రా, రంగయ్య, పిల్లాడికి ఇప్పుడే చిన్న దెబ్బ తగిలింది, బొంగరం గుచ్చుకుంది. మా కిరణ్ వేలికి కట్టు కడుతుంటే కేకలేస్తున్నా. కాసేపటిలో అయ్య వస్తారు, కార్లో డాక్టరు దగ్గరకి తీసికెళ్ళి ఒక ఇంజక్షన్ ఇప్పించాలి. ఇవాళ, రేపు రెండు రోజులు వాడికి ఏ పనీ చెప్ప కుండా రెస్ట్ యిస్తే వేలి నొప్పి తగ్గిపోతుంది. నువ్వేం ఖంగారు పడకు. అరుణ మాటలకి విస్తుపోయాడు కిరణ్, తలొంచుకొని నవ్వుకున్నాడు రాములు.

"ఆడిని మీ దగ్గరే వుంచుకోండి. ఎక్కడికి తీసికెళ్ళను? మనసు మార్చుకున్నా. నాతో పాలవ్యాపారంలో తిప్పటంకన్నా, ఇక్కడ మీలాటి పెద్దోళ్ళింట్లో నీడపట్టునవుంటే బాగుంటుంది. చిన్నబాబు నాలుగు అక్షరం ముక్కలు నేర్పితే...."

"ఆ! ఆ! పెదబాబు, చినబాబు ఇద్దరూ వీడికి చదువు చెప్తారులే. నువ్వేం బెంగపడకు. అయినా, పిల్లాడు కాస్త నునుపు తేలి చక్కగా ఉన్నాడు చూసావా. వాణ్ణి నేను ఎక్కడికీ పంపను" అంది నవ్వుతూ అరుణ వీడు తన ఇంట్లో నౌకరుగా ఎప్పటికి వుండిపోతాడనే ధైర్యం మనసులో కలిగి.

"రాములూ! నువ్వు స్కూల్లో చదువుకోవా? నీకు చదువు రాదా?" కిరణ్ పాదాలకి రాములు సాక్సు తొడుగుతుంటే అడిగాడు కిరణ్.

"నన్ను బడికి ఎవరు పంపుతారండీ?" బూట్లు తొడుగుతూ అన్నాడు రాములు.

కిరణ్ స్కూలుకి వెళ్ళిపోయాడు. ఆ పసివాడి మనసు నిండా రకరకాల ఆలోచనల్లు.

లంచ్ బెల్లు కొట్టేసరికి టిఫిన్ క్యారియర్‌తో సిద్ధమయ్యాడు రాములు. పొట్టి లాగూ చొక్కా, అవి తనకు పొట్టి అయినవే. రాములు కిరణ్ కన్నా రెండేళ్ళు పెద్దవాడు.

కిరణ్ అన్నం తింటున్నాడు. రాములు అటు తిరిగి నుంచున్నాడు.

"ఇటు తిరుగు."

"వద్దండి, మీరు అన్నం తింటుంటే నేను చూడకూడదు. అదేదో తగులుతుందట అమ్మగారంటారు" కిరన్ అటు తిరిగే అంటున్నాడు.

వాడు చూస్తే తనకి దిష్టి తగులుతుందా? కిరణ్‌కి నవ్వొచ్చింది. "ఇటు తిరుగు, నా ప్రక్కన కూర్చో, ఈ ప్లేట్లో అన్నం తిను" రాములుకి భయం వేసింది. అమ్మగారికి తెలిస్తే!!

"నేను అమ్మకి చెప్పనుగా, తిను ఇవాల్టి నుంచి మన మిద్దరం తిందాం."

రాములుకి కళ్ళలో నీళ్ళు నిండాయి. ఆ అమ్మగారు! ఈ బాబు గారు!? ముద్ద గొంతులోకి దిగటంలేదు. పళ్లెంలో అన్నం గబగబా తినేసి నీళ్లు తాగాడు రాములు.

కిరణ్ పసి మనస్సు నిండా రాములే నిండిపోయాడు. తనలాగే సన్నగా వుంటాడు, తనలాగే తెల్లగా ఉంటాడు, తనలాగే చక్కగా చదువుకుంటే రోజూ రాములు, తను కలసి స్కూలు కెడితే ఎంత బాగుం టుంది? కిరణ్‌కి నిద్ర పట్టటంలేదు. గడియారం పది గంటలు చూపిం చింది. బయట బాగా చలి వేస్తోంది. కిరణ్ వంటి మీద ఎర్రని స్వెటర్ వెచ్చగా ఉంది. నెమ్మదిగా తలుపు తెరిచి బయట కొచ్చాడు. వంటింటి ముందు వరండాలో ముడుచుకు పడుకున్నాడు రాములు. ఒక తుండు గుడ్డ కప్పుకున్నాడు. అయ్యో, ఇంత చలిలో అమ్మ అల్లిన స్వెటర్లు గూట్లో ఉన్నవి గుర్తొచ్చాయి కిరణ్‌కి. ఒక్కటి వీడికిస్తే....

నెమ్మదిగా గూటి దగ్గరకి నడిచాడు, పసుపు, ఎరుపు దారాల స్వెటర్ ఎంతో బాగుంది, చేత్తో తీసుకున్నాడు.

"ఆగు."

ఉలిక్కిపడ్డాడు కిరణ్.

"నిద్ర పట్టడంలేదా?" తల్లి కిరణ్ వంక చూస్తోంది.

"మంచినీళ్ళు."

"నీ మంచం దగ్గరే ఉన్నాయిగా" ఇటియ్యి ఆ స్వెటరు. "వాడు చలికి చచ్చిపోతాడని భయమా నీకు. ఈ స్వెటరు ఖరీదు ఎంతో తెలుసా?"

"వాడు చలికి వణికిపోతున్నాడు, పాపం" కిరణ్ చేతిలో స్వెటరు గట్టిగా పట్టుకున్నాడు.

"ఇటియ్యి, వెళ్ళి పడుకో" స్వెటరు లాక్కుంది అరుణ. కిరణ్ గదిలో కెళ్ళిపోయాడు.

"వాడితో నువ్వు ఇంకోసారి మాట్లాడటం, ఆడుకోటం చూస్తే వాడి కాళ్ళూ, నీ కాళ్ళూ కూడా విరక్కొడతా రా" అరుణ లైట్ ఆర్పేసింది. కిరణ్ గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. నిద్ర పట్టలేదు. నెమ్మదిగా లేచి తల్లి గదిలో కొచ్చాడు.

"వాడు చాల మంచివాడమ్మా! నేను అన్నం పెడితే తినమంటే తినను కాక తినన్నాడు. నేనే బలవంతంగా వాడికి నోట్లో కుక్కాను తెలుసా! వాడు, పాపం చాల మంచివాడు" ఆ స్వెటర్ వాడికి ఇద్దాం, చలిలో వాడు" అరుణకి ఒళ్ళు మండిపోయింది.

"ఏమిటీ? వాడి నోట్లో నువ్వు అన్నం పెట్టావా? వాడికి నీ ప్లేట్లో అన్నం పెట్టావా? సరే వెళ్ళి పడుకో" ఉరిమింది అరుణ.

"నేను తినలేదమ్మా. చినబాబే నన్ను తినమని" రాములు గట్టిగా ఏడుస్తున్నాడు. బెల్టు దెబ్బలు వీపు మీద పడుతున్నాయి. ఉలిక్కిపడి నిద్రనుంచి లేచాడు కిరణ్.

"వాడు తినమంటే నువ్వు తింటావా! వాడు పసివాడు, వాడితో నీకు వంతా, దున్నపోతులా బలిసి" బెల్టు దెబ్బ ధన్‌మని పడింది.

కిరణ్ తల్లి దగ్గరనుంచి బెల్టు లాక్కున్నాడు. ఒక్క ఉరుకున వచ్చి—

"వద్దు మమ్మీ."

"అసలు నిన్ను కొట్టాలి. అరుణ సోఫాలో కూలబడింది. రాములు వంటింట్లోకి పనికి వెళ్ళిపోయాడు.

కిరణ్‌కి హోంవర్క్ చేసుకో బుద్ధిపుట్టడం లేదు. నిన్న క్లాసులో మేష్టారు చెప్పిన మాటలే గుర్తొస్తున్నాయి. వీధి దీపం చిన్నదయినా, ఆ వీధిలో అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది అని - కిరణ్ మనసుకి ఒక్కసారి అనిపించింది ఈ రాములు వీధిదీపమే - నిజంగానే ఎంతమందికో సాయం చేస్తుంటాడూ - "ఒరేయ్ - రాములు, మా పనిమనిషి రాలేదు. కాస్త ఈ గిన్నెలు తోము" అంటుంది పిన్నిగారు.

"ఒరేయ్ — రాములు - నా షర్టు అర్జంటుగా ఇస్త్రీ చేయించుకురా— పరుగెత్తు — అన్నయ్య తొందర పెట్టేస్తాడు -" రాములు పరిగెడతాడు.

"ఒరేయ్ రాములు — రిక్షా పట్టుకురా" రాములే పరిగెడతాడు. అబ్బబ్బ, ఎన్ని పనులో. ఎందరికో - ఇంట్లో అమ్మ చేయించుకునే పనులకు లెక్కలేదు. పాపం రాములు, వీధిదీపం.

"మమ్మీ, మమ్మీ - కిరణ్ గట్టిగా పిలుస్తున్నాడు తల్లిని, పేపరు చూస్తూ.

"ఏమిటి?" అరుణ ఖంగారుగా వచ్చింది రాములు గబగబా వంటింట్లోంచి వచ్చి గుమ్మంలో నిల్చున్నాడు.

బాల ఖైదీల పరారీ పెద్ద అక్షరాలతో వున్న వార్త పైకి చదువుతూ, "బాల నేరస్తులు పదముగ్గురూ జైలునుంచి తప్పించుకున్నారట. అందులో ఒకడు గోడదూకబోయి పడి కాలు విరక్కొట్టుకున్నాట్ట. పాపం, అయ్యో కాలు విరిగిపోయిందట. అందరిలాగే వీడూ తప్పించుకుని పరిగెడితే బాగుండేది—" పేపరులోకి కిరణ్ చూస్తున్నాడు.

"కాలువిరిగిందా అండీ. ఎవరిదండీ"— రాములు చొక్కాకి చేతులు తుడుచుకుంటూ ఖంగారుగా అన్నాడు.

"నీకెందుకు అనవసరమైన విషయాలు. పో.... పనిచూసుకో"— అరుణ అరిచింది.

"నెమ్మదిగా మాట్లాడు. ఇళ్ళలో దొంగతనాలు చేసేవాళ్ళు, ఇళ్ళలోంచి పారిపోయేవాళ్ళు, ఇలాటివాళ్ళు — వాళ్ళని పట్టుకొని జైల్లో పెడతారు. ఉష్ — నెమ్మదిగా, వినూ. నువ్వు ఈ విషయాలు గట్టిగా మాట్లాడకు. ఆ రాములుగాడు వింటాడు."

అరుణ అంటున్న మాటలు అర్థం కావడంలేదు కిరణ్‌కి. "అసలు ఎందుకు పారిపొయారో వాళ్ళు? పాపం."

"దెబ్బలు పడలేక."

"అంటే? కొడతారా!"

"చచ్చేట్టు — కొడతారు." అరుణ పేపరు కిరణ్ చేతిలోంచి లాక్కుంది.

వంటింట్లో రాములు చేతిలోంచి టీకప్పు జారి కిందపడి ముక్కలయింది. రాములు గబగబా గాజుముక్కలు ఏరి చెత్తబుట్టలో పారేశాడు.

రాములుకి నిద్రపట్టటంలేదు. పేపరులో విశేషాలు ఇంకా ఏమిటో. చినబాబు చెప్తాడు ... ఆ కాలు విరిగినవాడి పేరుకూడా రాసారేమో— రాములు అటు ఇటు చూసాడు. చినబాబు గదిలో నిద్రపోతున్నాడు.

"బాబు—" నెమ్మదిగా కాలు తట్టాడు.

"నెమ్మదిగా. రాముల్ని.... చినబాబు — "పొద్దున్న చదివారే ఆ పేపరు — ఒక్కసారి మళ్ళా చదవండి" బతిమాలుకున్నాడు.

"ఏమిటి?" — కిరణ్‌కి అర్థం కావటంలేదు.

"పేపరు ఎందుకూ?"

"ఒక్కసారి చూడు బాబు."

కిరణ్ పేపరు తెచ్చి 'బాలఖైదీల పరారీ' గురించి చదివాడు.

"అక్కడ, ఆపండి బాబు.... ఆ పేరు చదవండి. అదే కాలువిరిగిన వాడి పేరు."

"వీరడు."

"వీరడా – అయ్యో–" రాములు వెంటనే అన్నాడు నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుంటూ.

"రాములూ – నీకు తెలుసా వీరడు."

రాములు క్షణం మాట్లాడలేదు.

"తెలుసా" మళ్ళీ రెట్టించాడు కిరణ్.

"మా ఊరివాడండి. ఆ.... వాడు దొంగ కాదండి అసలు. వాడు పనిచేసే ఇంట్లో ఒకసారి వాచీ పోయిందండి. అది వీడే తీసేడన్నారండి. కానీ ఆ వాచీ ఇంటివాళ్ళ అమ్మాయి ఫ్రెండు కాజేసిందండి. ఆ విషయం వీరడు చెప్పాడండి. అమ్మాయి అన్న పెద్ద రౌడీ అండి. వాడు వీరడిని తన్నాడండి. అప్పుడు మా అన్న –

"ఏమిటీ? మీ అన్న" కిరణ్ గట్టిగా అరిచాడు.

"కాదండి. ఆ అమ్మాయి అన్న తంతే, వీరడు తిరిగి తన్నాడండి. అళ్ళు గొప్పోళ్ళు కదండి. వీరడు మీద లేనిపోని కేసులు కొన్ని పెట్టి జైల్లో పడేయించారండి – పాపం, వీరడు, చెయ్యని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నాడండి–! రాములు క్షణం మాట్లాడలేదు. "అందుకేనండి నేను ఎవరు నన్ను కొట్టినా, తిట్టినా ఏమన్నా ఏమీ అననండి. నాకు జైలంటే చాలా భయం చినబాబూ! రాములు ఏదో చెప్పబోతున్నాడు.... గదిలోకి ఎవరో వచ్చారు!! రాములు ఖంగారుగా బయటికి పరిగెత్తాడు. కిరణ్ గబుక్కున మంచంమీద కెళ్ళి పడుకుని, దుప్పటి పూర్తిగా కప్పుకుని కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. కిరణ్ ఆలోచనలు రాములు చుట్టూ

తిరుగుతున్నాయి. మధ్యమధ్య వీరడు విషయం గుర్తొస్తుంది. రాములు అదివరకులా కనిపించటంలేదు. ఎప్పుడు ఏదో చింత, బెంగ కనిపిస్తోంది వాణ్ణి చూస్తుంటే. నాలుగు రోజులు ఊరు వెళ్ళి వచ్చాడు రాములు. వచ్చినప్పట్నుంచీ మరీ ముభావంగా వుంటున్నాడు.

తన బూట్లు తనే పాలిష్ చేసుకుంటున్నాడు కిరణ్. "వాడు చేసే పనులు వాణ్ణి చేయనీయవేమిరా, అలాగే వాణ్ణి సోమరిలా తయారు చేస్తున్నావు" అరుణ కొడుకుని కేకలేస్తోంది.

అరుణ హడావిడిగా అటు ఇటు తిరిగింది. గబగబా దుప్పట్లు అన్నీ కిందపడేసి దులిపింది.

"ఏమైందీ?" అంది ఖంగారుగా.

"ఏమిటి మమ్మీ!" కిరణ్ భుజాన బేగ్ వేసుకుంటున్నాడు స్కూలికి వెళ్ళాలని.

"అదే నా ఉంగరం!"

"ఉంగరమా? చూడు, అదే కనిపిస్తుంది."

అరుణ ఇల్లంతా వెతికింది.

"రాములూ, నువ్వు గది ఊడ్చేప్పుడు చూడలేదురా?"

"నాకు తెలియదమ్మా!" గిన్నెలు తుడిచి లోపల పెడుతున్నాడు పెదబాబు స్కూటర్ స్టార్ట్ చేసి బయటకెళ్ళాడు.

వారం రోజులు ఇంట్లో అదే విషయం. ఉంగరం దొరకలేదు.

"మొన్న నాన్న జేబులో వంద రూపాయల నోటు కనిపించలేదు. ఎక్కడ మరచిపోయారో అనుకున్నాను. ఇప్పుడిది! సరే కాని, దొరక్క పోతుందా? పోలీసులకు అప్పచెప్తే వాళ్ళే నాలుగుతన్ని, మన వస్తువు మనకి ఇప్పిస్తారు – దొరుకుతుందిలే."

"ఎక్కడికి పోతుందీ?" అరుణ గట్టిగా అంటోంది అందరికీ వినపడేలా.

మళ్ళా నాలుగురోజులు గడిచాయి.

"ఇవాళ ఇది పోయింది, రేపు మరోటి, మరోటీ - ఇలా చూస్తూ ఊరుకోటమేనా? నాలుగు తన్ని రాబట్టుకుందామా?

"తన్నండి తన్నండి!" రాములు అప్రయత్నంగా పైకి అనేసి నాలుక కొరుక్కున్నాడు.

"ఎవర్ని తన్నాలి?"

ఎవరు తీస్తే వారిని. రాములు గదితుడుస్తూ మనసులో అనుకున్నాడు. కానీ రాములుకి వీరడు కళ్ళముందు కనిపించినట్లయింది. చెయ్యని తప్పుకి శిక్ష అనుభవించి కాలువిరక్కొట్టుకున్న వీరడు. రాములు గబ గబా గది తుడిచి చీపురు లోపల పెట్టేశాడు. ఈ గదులన్నీ తుడిచి తుడిచి ఇలాగే అరిగి పోవాలా!!....రాములికి నవ్వొచ్చింది! చీపురుని మరీ మూలకి తోసేశాడు.

ఆక్షణంలోనే నిశ్చయించుకుంది అరుణ రాముల్ని పోలీసులకి అప్పగించి, తన్నించి ఉంగరం రాబట్టాలని!

తెల్లవారింది ఏడుదాటింది ఏసందడీ లేదు వంటింట్లో.

"రాములూ" అరుణ గొంతు చించుకుంటోంది. ఇంట్లో అందరూ లేచి అటు ఇటు వెతికారు.

రాములూ, లేడు, వాడి సంచీ లేదు!!

ఇప్పుడు చెప్పు నీ స్నేహితుడు, అదే ఆ రాములుగాడి గురించి నిలదీసింది తల్లి కిరణ్ ని.

ఏంచెప్తాడూ! రాములెందుకు వెళ్ళిపోవాలి? నిజంగా రాములు ఆపని చేసి వుంటాడా? ఛా, రాములలాంటి వాడుకాడు. మరి ఎలాటి వాడూ! కిరణ్ మనసు రకరకాలుగా ఆవేదన చెందింది. వెళ్ళిపోయాడూ అంతే మరి అదే కదా!

నెలలు గడిచాయి, ఉంగరము విషయం అంతా మాట్లాడటం మానేసారు. ఆ ఇంట్లో మరో నౌకరు వచ్చాడు వాడు ఒకమాట పడడు,

ఎదురు తిరిగి పోట్లాడుతాడు. వాడంటే అరుణకి కూడా భయమే!
రాముల్ని అందరూ మరిచిపోయారు.

కిరణ్ మాత్రం రాములు విషయమే ఆలోచిస్తుంటాడు. తనకైనా చెప్పకుండా ఎందుకెళ్ళిపోయాడో ఎంత అనుకున్నా మనసు సమాధాన పడటం లేదు కిరణ్‌కి.

ఎప్పటికయినా ఎక్కడయినా రాములు కనిపించకపోతాడా అనే ఆశ కిరణ్‌కి వుంది. సినిమాకెళ్ళినపుడు, బజారు కెళ్ళినపుడు వెతుకుతూనే వుంటాడు కిరణ్ రాములు కోసం.

కిరణ్ కూరగాయల మార్కెట్‌కెళ్ళాడు. కూరలు సంచిలో నింపుతున్నా, ఎక్కడయినా రాములు కనిపిస్తాడని ఆశగా దిక్కులు చూస్తున్నాడు.

ఏయ్ రాములూ, కిరణ్ పరిగెత్తాడు, కూరలుతట్ట మోస్తున్న కూలి దగ్గరకి.

రాములు కిరణ్‌ని చూసి ఆనందం పట్టలేకపోయాడు. "బాబూ మీరాండి. సంచి యిటియ్యండి, నేను పట్టుకుంటా." కిరణ్ చేతిలో సంచి లాక్కుని తన తట్టలో పెట్టుకున్నాడు.

"అంతా బాగున్నారా బాబూ."

కిరణ్ ఏమడుగుతాడో తెలుసు రాములుకి.

"ఎందుకెళ్ళిపోయావు చెప్పకుండా. నాతో కూడా చెప్పకుండా" కిరణ్ గొంతు వణికింది. రాములు నవ్వాడు హాయిగా. మరీ హాయిగా. "చెయ్యని నేరానికి శిక్షపడి, జైలుదెబ్బలుపడి, గోడదూకటం రాక కాలు విరిగి కుంటిగా బతకటం ఇష్టంలేక బాబూ." రాములు మళ్ళా గలగలా నవ్వాడు. కిరణ్ కళ్ళలో నీళ్ళు అడ్డుపడుతున్నాయి. గోడదూకి పడి కాలువిరిగిన బాల ఖైదీ వార్త ఆనాడు చదివింది వెంటనే గుర్తొచ్చింది.

కుంటివాడు సోడాబండి లాగుతూ వచ్చాడు. "వీరడు, మా అన్న" రాములు సోడాసీసా కిరణ్ చేతి కందించాడు, చల్లని సోడా గొంతు మండించింది. కిరణ్ వీరడు వైపే చూస్తున్నాడు.

"ఉన్న విషయంటెప్తే మీ అన్న చంపేస్తానన్నాడండి. చెప్పకపోతే చేయని నేరం నాకు అంటగడతారండి. లోకంలో న్యాయంలేదు కదండి." బాబూ సోడా తాగండి, చల్లగ వుంది. రాములు కిరణ్‌వైపే చూస్తున్నాడు.

"మా అన్న నిన్ను ఎందుకు చంపుతానన్నాడు" అని అడగాలని పెదాలు కదిపాడు కిరణ్. కానీ అది తెల్సుకోవడంవలన ఇప్పుడు ఒరిగేదేముంది. దానికన్నా చేయని నేరాన్ని నెత్తిన వేసుకుని బయటకొచ్చిన ఈ రాములు మనసు ఎంత గొప్పదో తను అంచనా వేయగలిగితే, ఈ గొప్పమనిషిని ఒక్కసారి కౌగలించుకుంటే తన మనసు కొంత ప్రక్షాళనం అవుతుందా." కిరణ్ రాముల్ని కౌగలించుకున్నాడు గట్టిగా. "బాబూ" మాటలు తడబడ్డాయి రాములుకి.

"ఈ దొంగాడిని గుండెలకి హత్తుకుంటున్నారేటండి బాబూ. ఇంట్లో అందరూ, అన్నయ్యగారు కూడా నన్ను దొంగని అంటున్నారా" రాములు ఎటో చూస్తున్నాడు.

అవును, కాదు అనే ఏ సమాధానం చెప్పలేని స్థితిలో కిరణ్ తల వంచుకుని కళ్ళుమూసుకున్నాడు.

* ['జాషువా' త్రైమాసిక సాహిత్య సంచిక, మార్చి, 1996] *